నీలకంఠేశ్వరా.. నమోస్తుతే

- మహాశివరాత్రి పర్వదినాన శివాలయాలకు పోటెత్తిన భక్తజనం
- పలుచోట్ల శివపార్వతుల కల్యాణ మహోత్సవం

నీలకంఠేశ్వరా.. నమోస్తుతే.. పరంధామా పరమేశ్వరా.. మమ్ములను దీవించు తండ్రీ అంటూ భక్తాదులు ప్రత్యేక పూజలతో వేడుకున్నారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా బుధవారం శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల్లో వేకువజామునుంచే శివాలయాలకు భక్తులు పోటెత్తారు. సంప్రదాయ దుస్తులతో కుటుంబ సమేతంగా ఆలయాలకు తరలివచ్చారు. ఆలయంలోని శివలింగం వద్ద వారి వెంట తెచ్చుకున్న పండ్లు, పూలు ఉంచి అర్చకులచే అభిషేకం, అర్చన, ప్రత్యేక పూజలు చేయించుకున్నారు. భక్తులు ఉపవాస దీక్షలు పాటిస్తూ పరమశివుడిని పూజించారు. హనుమాన్ నగర్ కొత్తగంజ్‌లోని నీలకంఠ మల్లికార్జున స్వామి ఆలయంలో మహాశివరాత్రి, 35వ వార్షికోత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్ కుటుంబ సమేతంగా పాల్గొని స్వామివారికి అభిషేకం చేశారు. అడ్డాకుల మండలంలో రెండో దక్షిణకాశీగా పేరుగాంచిన కందూరు రామలింగేశ్వరస్వామి ఆలయాన్ని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, మహబూబ్‌నగర్ ఎస్పీ జానకి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కర్ణాటక రాష్ట్రం గుల్బర్గా జిల్లా సేడెం తాలూకా యానగుంది క్షేత్రం మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శివనామ స్మరణతో మారుమోగింది. శివరాత్రి ఉత్సవాలను మాణిక్యగిరి ట్రస్టు కార్యదర్శి శివయ్యస్వామి ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు.

- న్యూస్ నెట్‌వర్క్, ఆంధ్రజ్యోతి

- వివరాలు లోపలి పేజీల్లో..


నారాయణపేటలోని గాంధీనగర్ లింగయ్యగుడి వద్ద బారులు తీరిన భక్తులు


నారాయణపేట జిల్లా సింగారంలో స్వామివారి పల్లకీ సేవ


మాణిక్యగిరి క్షేత్రంలో అమ్మవారి పాదుకా పూజలో శివయ్యస్వామి, కర్ణాటక ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ


కందూరు ఆలయంలో పూజలు చేస్తున్న మహబూబ్‌నగర్ ఎస్పీ డి.జానకి


దామరగిద్ద మండలం మద్దెల్‌బీడ్‌లో నిర్వహించిన శివపార్వతుల కల్యాణంలో శివస్వాములు


పేటలోని లింగయ్య గుడిలో..


నీలకంఠ స్వామి ఆలయంలో అభిషేకం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్


మహబూబ్‌నగర్‌లోని శివాలయంలో పూజలు చేస్తున్న ఆనంద్‌కుమార్ గౌడ్


మహబూబ్‌నగర్ సాంబ శివాలయంలో బారులు తీరిన భక్తులు


పేట శివలింగేశ్వర స్వామి ఆలయంలో అభిషేకం చేస్తున్న భక్తులు




మహబూబ్‌నగర్ రామలింగేశ్వర ఆలయంలో..

యువతుల భక్తిపారవశ్యం

రెండు రోజుల్లో.. కొలిక్కి వచ్చేనా?

- రేపటి వరకు సహాయక చర్యలు పూర్తి చేస్తామన్న మంత్రి ఉత్తమ్
- ఇంకా సొరంగంలో అలాగే ఉన్న బురద... ఐరన్ వ్యర్థాలు, మట్టి దిబ్బలు
- టీబీఎం కటింగ్‌కు కంపెనీ ఒప్పుకోవడంతో సహాయక చర్యలు ముమ్మరం
- సొరంగంలో ఇరుక్కుపోయిన వారు ప్రాణాలతో బయటపడతారా? అనే సందేహాలు
- రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలకు వారు ప్రాణాలతో తిరిగి రావాలని ఆశలు
- శ్రీశైలం ఆలయంలో వారి క్షేమం కోసం పూజలు చేసిన మంత్రి కోమటిరెడ్డి, ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి


శ్రీశైలం ఎడమ గట్టు సొరంగ మార్గం

మహబూబ్‌నగర్/దోమలపెంట, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ఎడమగట్టు కాలువ సొరంగంలో ఇరుక్కుపోయిన 8 మందిని రక్షించడానికి చేపట్టిన సహాయక చర్యలు ఎప్పుడు కొలిక్కి వస్తాయోననే ఆందోళన నెలకొంది. ఇప్పటివరకు లోపల ఐరన్ వ్యర్థాలు, సిల్ట్, మట్టిదిబ్బల తొలగింపు ప్రక్రియ ప్రారంభం కాకపోవడం, కీలకమైన కన్వేయర్ బెల్టు కూడా అందుబాటులోకి రాకపోవడంతో సందేహాలు మరింత పెరిగాయి. అయితే తాజాగా బుధవారం సాయంత్రం రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.... రెండు రోజుల్లో రెస్క్యూ ఆపరేషన్ పూర్తి చేస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. అయితే, 15 ఫీట్ల మేర పేరుకుపోయిన బురద.... 18 టన్నుల వరకు ఉన్న ఐరన్ వ్యర్థాలు 100 మీటర్ల మేర ఉన్న మట్టి దిబ్బలు ఇంత తక్కువ సమయంలో తొలగింపు, బయటకు తరలింపు అసాధ్యమని భావించవచ్చు. అలాగే కన్వేయర్ బెల్టు ఇంకా మరమ్మతు కాలేదు. అన్నీ పనిచేస్తే కొంత సమయం ఆదా కావచ్చు. లోకో ట్రెయిన్ ద్వారా బయటకు తేవాలన్నా 14 కిలోమీటర్ల దూరం పోవడానికి, రావడానికి ఒకేదారి ఉండటం, రెండు గంటలపైన సమయం తీసుకుంటుంది. ఈ నేపథ్యంలో అంత త్వరగా రెస్క్యూ ఆపరేషన్ ముగించడం కష్టమనే చెప్పవచ్చు. అయితే ఇప్పటివరకు పలు

- మిగతా 6లో..

● టీబీఎం కటింగ్ నిర్ణయమే ఆలస్యం...

టన్నెల్ బోరింగ్ మిషన్ ఖరీదు దాదాపు రూ. 300 కోట్ల వరకు ఉంటుందని అంచనా.. రెస్క్యూ ఆపరేషన్‌కు ఈ మిషన్ అడ్డంగా మారింది. అయితే మొదట్లోనే ఈ మిషన్‌ను కట్ చేసి రెస్క్యూ ఆపరేషన్లు కొనసాగించాలని సహాయక బృందాలు సూచించాయి. స్థానికంగా ఉండే కంపెనీ ప్రతినిధులు ఆ విషయంలో ఎలాంటి అనుమతి ఇవ్వలేదని సమాచారం. బుధవారం కంపెనీ ఛైర్మన్ జయప్రకాష్ వచ్చి ఓకే చెప్పడంతో వ్యర్థాల తొలగింపు, ఇరుక్కుపోయిన వారి గుర్తింపు వేగం అయ్యే అవకాశాలు ఉన్నాయి.


సొరంగంలో సహాయక చర్యల్లో రెస్క్యూ బృందం

బాస్కెట్‌బాల్ టోర్నీలో రాష్ట్ర జట్టు సత్తా చాటాలి

- బాస్కెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా ప్యాట్రన్ మనోహర్‌రెడ్డి


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న బాస్కెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా ప్యాట్రన్ మనోహర్‌రెడ్డి, పక్కన ఒలింపిక్ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎస్పీ వెంకటేశ్

7

డివైడర్‌ను ఢీకొని కారు బోల్తా

- టైర్ పంక్చర్ కావడంతో అదుపుతప్పిన వాహనం
- స్వల్ప గాయాలతో బయటపడ్డ ముగ్గురు యువకులు

7


బోల్తాపడిన కారును పైకెత్తుతున్న యువకులు

మూలకు మురిపెంగా..

● రూ. 3 కోట్ల యంత్రాల పరిస్థితి


మూలకు పడ్డ రూ.లక్షల విలువైన వెంటిలేటర్లు

- రెండేళ్లుగా మరమ్మతులకు నోచుకోని వైనం
- మరమ్మతు చేస్తే వినియోగంలోకి వైద్య యంత్రాలు, పరికరాలు
- రూ. 20 లక్షలు అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదనలు
- నిధుల కోసం ఎదురుచూస్తున్న జనరల్ ఆసుపత్రి అధికారులు

విలువైన వైద్య పరికరాలు మూలకు చేరి మురిపెంగా దర్శనమిస్తున్నాయి. అందులో దాదాపు రూ.3 కోట్ల విలువైన వైద్య పరికరాలు, యంత్రాలు, పనిముట్లు ఉన్నాయి. వాటికి మరమ్మతులు చేయించాలంటే కనీసం రూ.20 లక్షల దాకా ఖర్చు అవుతుంది. ప్రధానంగా 30 వెంటిలేటర్లు, 40 సిపాస్ మిషన్లు స్క్రాప్ కిందకు చేర్చడం విమర్శలకు దారితీస్తోంది. రెండేళ్లుగా వీటిని వృథాగా పడేయడంతో మెరుగైన వైద్యసేవలకు ప్రజలు దూరమవుతున్నారు. వీటి మరమ్మతుల కోసం నిధులు సమకూర్చాలని ఆసుపత్రి వర్గాలు అటు పాలకులకు, ఇటు వైద్య ఉన్నతాధికారులకు విన్నవించినా స్పందన లేకపోవడం గమనార్హం.

6

- మహబూబ్‌నగర్(వైద్యవిభాగం), (ఆంధ్రజ్యోతి)

● ప్రతిపాదనలు పంపించాం...



జనరల్ ఆసుపత్రిలో చాలా కాలంగా కొన్ని యంత్రాలు పనిచేయడం లేదని మూలకు పారవేశారు. వాటికి మరమ్మతులు చేయించే ఏర్పాట్లు చేస్తున్నాం. అయితే ఇందుకోసం రూ. 20 లక్షల వరకు అవసరం ఉంటుంది. ఈ మేరకు నిధులు అవసరమని ఉన్నతాధికారులకు, ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. నిధులు ఇస్తారనే నమ్మకం ఉంది. అన్ని యంత్రాలను మరమ్మతులు చేయించి సేవల్లో ఆసుపత్రిని మరింత అభివృద్ధి చేయాలన్నదే నా లక్ష్యం.

-డాక్టర్ సంపత్‌కుమార్ సింగ్, జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్

శివనామ స్మరణతో
మారుమోగిన మాణిక్యగిరి క్షేత్రం

- ప్రత్యేక పూజలతో పరవశించిన భక్తజనం



మాణిక్యగిరి క్షేత్రానికి వెళ్తున్న భక్తులు

దామరగిద్ద, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రం గుల్బర్గా జిల్లా సేడెం తాలూకా యానగుంది క్షేత్రం మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శివనామ స్మరణతో మారుమోగింది. క్షేత్రంలోని పలు దేవాలయాల్లో పూజలతో వేలాదిగా తరలివచ్చిన భక్తజనం పరవశించింది. మాణిక్యగిరి క్షేత్రంలో ప్రతీ ఏటా మాదిరిగా ఈసారి కూడా మహా శివరాత్రి ఉత్సవాలు మాణిక్యగిరి ట్రస్టు కార్యదర్శి శివయ్యస్వామి ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. మహాశివరాత్రి బుధవారం ఉదయం 9గంటల నుంచి సహన్యాస పూర్వక మహారుద్రాభిషేకం, మాత పాదుక పూజ, మహా మంగళ హారతి, మధ్యాహ్నం 12 గంటల నుంచి జనద్గురు రూపరహిత అహింస యోగేశ్వరి వీర ధర్మజమాత మాణిక్యేశ్వరి మాత దివ్యసమాధిని వేలాదిగా భక్తులు తరలి వచ్చి దర్శించుకొని పరవశించారు. అదే విధంగా పార్వతీ వేంకటేశ్వర, బ్రహ్మ, సరస్వతి, భవాని మాత, ఆంజనేయ తదితర దేవాలయాలు భక్తులతో కిక్కిరిసి పోయాయి. ఉదయం నుంచి భక్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ప్రతీ ఏటా మాదిరిగా ఈసారి కూడా ట్రస్టు ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. గురువారం రాత్రి 7గంటలకు మహారథోత్సవం నిర్వహిస్తారు. శుక్రవారం ఉదయం పల్లకి సేవ నిర్వహిస్తారు. ఈ మహాశివరాత్రి ఉత్సవాల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. ఈ కార్యక్రమంలో కంకనూరు ఎమ్మెల్యే అల్లం ప్రభు, ఎమ్మెల్సీ తిప్పన్న, డిప్యూటీ కలెక్టర్ గోవింద్‌రెడ్డి, ట్రస్టు సభ్యులు సిద్రామప్ప, బండి శివరాంరెడ్డి, మందర్ పాల్గొన్నారు.

దత్త క్షేత్రంలో ఘనంగా రథోత్సవం



దత్తపీఠం వద్ద రథాన్ని లాగుతున్న భక్తులు

మక్తల్‌రూరల్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా మక్తల్ మండలంలోని పసుపుల వద్ద ఉన్న వల్లభాపురం శ్రీదత్త క్షేత్రంలో మహాశివరాత్రి సందర్భంగా బుధవారం రథోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అన్నదాన కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఆలయంలో లక్ష దీపోత్సవం నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ మూర్తికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తుల చప్పట్లు, కేరింతల మధ్య రథాన్ని ముందుకు లాగారు. కార్యక్రమానికి పెద్దఎత్తున భక్తులు హాజరయ్యారు. మాత నిరంజననంద సరస్వతి, మాజీ ఎంపీపీ వనజ, పసుపుల మాజీ సర్పంచ్ దత్తు, రాంలింగారెడ్డి, బీజేపీ నాయకులు కొండయ్య, ఆశిరెడ్డి పాల్గొన్నారు.

చిన్నపొర్లలో...

ఊట్కూర్ : మండలంలోని చిన్నపొర్ల గ్రామంలోని ఈశ్వరాలయం వద్ద బుధవారం సాయంత్రం శివపార్వతుల రథోత్సవం నిర్వహించారు. వందలాది భక్తుల శివనామస్మరణ నినాదాల మధ్య రథోత్సవం వైభవంగా జరిగింది. రథం ముందు గ్రామ మహిళలు హారతులతో ముందుకు నడిచారు. అంతకుముందు గ్రామంలో ఉదయం జల్ది బిందెను తీసుకొచ్చి ఆలయంలో పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం పల్లకీసేవ చేశారు. రాత్రి ఆలయంలో భజన కీర్తనలు ఆలపిస్తూ జాగరణ చేశారు.

రెండు రోజుల్లో కొలిక్కి వచ్చేనా?

(5వ పేజీ తరువాయి)

దఫాలుగా వెళ్లిన బృందాలు టీబీఎం ధ్వంసమైన ప్రాంతాలతో వాటి కింద ఏమైనా ఇరుక్కుపోయారా...? అనే అనుమానాలు వ్యక్తపరిచారు. దీంతో టీబీఎం కటింగ్ అయితే ఒకవేళ వాటి కింద ఏమైనా మృతదేహాలు దొరుకుతాయని ఆశాభావం ఉన్నట్లు తెలుస్తుంది. శనివారం ఉదయం 8.30 గంటలకు ప్రమాదం జరుగ్గా అప్పటినుంచి ఇప్పటివరకు లోపలకు వెళ్లి పరిశీలించి రావడం మినహా మిగతా పనులేవి చేపట్టలేదు. అలాగే సొరంగంలో కొంత ఎక్కువ అనుభవం ఉన్న సింగరేణి రెస్క్యూ బృందాలను కూడా ఎక్కువగా వినియోగించుకోవడం లేదు. అయితే హార్డ్ రాక్ ఉన్న మైన్స్‌లో వారి శక్తి పనికి వస్తుందనే భావనే వారిని ఎక్కువగా వినియోగించుకోవడం పోవడానికి కారణమని చెప్పవచ్చు.



సొరంగంలో సహాయక చర్యల్లో పాల్గొన్న రెస్క్యూ సిబ్బంది



శ్రీశైలం ఎడమ గట్టు సొరంగం వద్ద ఏర్పాటు చేసిన తాత్కాలిక వైద్య శిబిరం

● హెచ్చరించినా పట్టించుకోలే...

ఎస్ఎల్బీసీ టన్నెల్‌లో ప్రమాదం శనివారం ఉదయం షిఫ్టులో కార్మికులు పనిచేస్తున్నప్పుడు జరిగింది. అయితే అంతకుముందు రోజు రాత్రి షిఫ్టుకు వెళ్లిన కార్మికులు 3 గంటల సమయంలో పైనుంచి భారీగా 5 ఇంచులు, దిగువ నుంచి దాదాపు 2 ఇంచుల్లో నీరు ఉబికి వస్తుండటంతో గమనించిన కార్మికులు సూపర్‌వైజర్‌కు సమాచారం ఇచ్చి పనికి వెళ్లమని... పైన కూలిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఇదొక భయపెట్టి కార్మికులను పనిలోకి రాకుండా భయపెడుతున్నారని మందలించారు. హెచ్చరికలు ఖాతరు చేయకుండా ఉదయం షిఫ్టులో కార్మికులను పంపిన అరగంటలోనే ఈ ప్రమాదం జరిగి 8 మంది కార్మికులు ఇరుక్కుపోయారు. ఇప్పుడు వారి పరిస్థితిపై ఆందోళన నెలకొంది. వారు ప్రాణాలతో బయటపడతారా? అంటే దాదాపు తక్కువ అవకాశాలు ఉన్నట్లే... అసలు మొత్తంగా అవకాశం లేదని కూడా విశ్వసనీయంగా తెలుస్తున్నది. ఈ టన్నెల్ ప్రమాదఘటనలో ఇరుక్కుపోయిన వారు క్షేమంగా రావాలని ప్రజలు కోరుతున్నారు. శివరాత్రి పర్వదినం సందర్భంగా రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖామంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి శ్రీశైలం దేవస్థానంలో ఆ 8 మంది కార్మికులు తిరిగి రావాలని పూజలు చేశారు.

ఆకట్టుకున్న శివపార్వతుల
కల్యాణ నాటక ప్రదర్శన



శివపార్వతుల కల్యాణ నాటకాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

మహబూబ్‌నగర్ న్యూటౌన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మహబూబ్‌నగర్ పట్టణంలోని సింహగిరిలోని లక్ష్మీనరసింహ్మస్వామి ఆలయంలో బుధవారం రాత్రి ప్రదర్శించిన శివపార్వతుల కల్యాణం నాటకం భక్తులను ఆకట్టుకుంది. భక్తుల జాగరణ కోసం జనత సేవా సమితి మహ బూబ్‌నగర్, తెలంగాణ రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ సౌజన్యంతో వరకవుల నరహరి రాజు రచన, సంగీత, దర్శకత్వంలో నాటకాన్ని ప్రదర్శించగా, శివుడి పాత్రను వీడీఎస్ రాజు పోషించారు. విష్ణుమూర్తిగా నారాయణ, నారథుడిగా సంజీవ్ యాదవ్, దేవేంద్రుడిగా తిరుపతయ్య, బ్రహ్మదే వుడిగా హనుమంతు, చండీశ్వరుడు వశిష్టుడిగా వసంతరెడ్డి, పార్వతిగా అనిత, భద్రుడిగా రాఘవేందర్, నందీశ్వరుడిగా కోలాశంకర్, మన్మధుడి గా వెంకటయ్య, బృహస్పతిగా సత్యనారాయణ పోషించారు. తబలా డోలక్ కృష్ణ గుండుమాల్ వాయించగా, కర్నూల్ డ్రెస్ కంపెనీ రాజశేఖర్, మేకప్, లైటింగ్, డ్రెస్సింగ్ డిజైన్ చేశారు. నాటకంతో పాటు భక్తులు జాగరణ కోసం ఆలయ నిర్వాహకులు భజన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పాత్రదారులకు ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు.

మూలకు మురిపెంగా..

● రూ. 3 కోట్ల యంత్రాల పరిస్థితి

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం), ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా నిరుపేదలకు వరంగా ఉన్న మహబూబ్‌నగర్ జనరల్ ఆసుపత్రిలో రూ. 3 కోట్ల వైద్య పరికరాలు, యంత్రాలు, పనిముట్లు మూలకు చేరాయి. గత రెండేళ్లగా అవి మరమ్మతులకు నోచుకోవడం లేదు. వాటిని బాగు చేయించాలంటే దాదాపు రూ. 20 లక్షల వరకు ఖర్చు అవుతుంది. కానీ ఆ నిధులు లేక కోట్ల రూపాయల విలువైన యంత్రాలు పాడైపోయే స్థితికి చేరుకున్నాయి. ఇందుకోసం తమకు నిధులు కావాలని జనరల్ ఆసుపత్రి అధికారులు ఇటు ప్రజాప్రతినిధులకు, అటు ప్రభుత్వానికి, ఉన్నతాధికారులకు మొర పెట్టుకుంటూనే ఉన్నారు. అయినా ఎవరు కూడా స్పందించడం లేదు. ఫలితంగా యంత్రాలు మూలకు చేరడంతో పేద ప్రజలు నాణ్యమైన వైద్యానికి దూరమవుతున్నారు.

● యంత్రాలు మూలకు...

జనరల్ ఆసుపత్రికి అత్యవసర పరిస్థితి కోవిడ్ సమయంలోనే కాకుండా ఇతర సమయాలలో కూడా కొన్ని కోట్ల విలువైన యంత్రాలను ప్రభుత్వం మంజూరు చేసింది. అయితే రోగుల తాకిడి ఎక్కువగా ఉండటం, వాటి వినియోగానికి మించి వాడటంతో కొన్ని మూలకు పడ్డాయి. అందులో ప్రధానంగా వెంటిలేటర్లు, సిపాప్ మిషన్లు. ప్రస్తుతం 30 వెంటిలేటర్లు, 40 సిపాప్ మిషన్లు మూలకు పడి ఉన్నాయి. అదేవిధంగా ఒకటి 400 ఎంఏ ఎక్స్‌రే యంత్రం, 8 ఎలక్ట్రిక్ ఓటి టేబుళ్లు, 8 గైనిక్ ఓటి టేబుళ్లు, 25 ఐసీయూ పడకలు, సర్జికల్ మైక్రోస్కోప్, బీపీ ఆపరేటర్లు, 3 అల్ట్రాసౌండ్ మిషన్లు ఉన్నాయి.

● రూ. 20 లక్షలతో ప్రతిపాదనలు...

ఆసుపత్రిలో కాంటాక్ట్ కింద వేసిన వైద్య పరికరాలను బయటకు తీసి బయోమెడికల్ ఇంజనీరింగ్ అధికారులతో ప్రతిపాదనలు తయారు చేయించారు. ఆ ప్రతిపాదనలను ప్రభుత్వానికి, ప్రజాప్రతినిధులకు, ఉన్నతాధికారులకు పంపించారు. రూ. 3 కోట్ల విలువైన వైద్య పరికరాలు కేవలం రూ. 20 లక్షలతో బాగు చేయిస్తే ప్రభుత్వానికి రూ. 3 కోట్లు మిగులుతాయని భావించి ఈ ప్రతిపాదనలు రూపొందించారు. అయితే కొన్ని చిన్న చిన్న పరికరాలను ఆసుపత్రి అభివృద్ధి కమిటీ నిధులతో బాగు చేయించి అందుబాటులోకి తెచ్చారు.

వీటి ఖరీదు బయటి మార్కెట్‌లో దాదాపు రూ. 3 కోట్లకు పైనే ఉంటుందని జనరల్ ఆసుపత్రి అధికారులు చెబుతున్నారు.

● మరమ్మతులేవీ?

జనరల్ ఆసుపత్రికి వచ్చిన ఈ మిషన్లు ఎక్కువగా వాడటంతో అవి పనిచేయకుండా ఉన్నాయి. అయితే గత రెండేళ్ల క్రితం ఉన్న బయోమెడికల్ ఇంజనీర్లు వాటిని మరమ్మతులు చేయించకుండా పక్కన పెట్టేశారు. దీంతో అవి మూలకు చేరాయి. వాస్తవానికి అవి మరమ్మతులు చేస్తే వినియోగంలోకి వచ్చే అవకాశాలు ఉన్నప్పటికీ నిర్లక్ష్యంగా వాటిని స్క్రాప్ కిందకు వేశారు. ప్రభుత్వ ధనాన్ని వృథా చేయకుండా సూపరింటెండెంట్ సంపత్‌కుమార్ సింగ్ వాటిని మరమ్మతులు చేయించే అవకాశం ఉందని గుర్తించారు.

బయోమెడికల్ ఇంజనీర్‌తో పాటు సర్వీస్ కాంట్రాక్టరుతో వాటిని చెక్ చేయించారు. దీంతో అవి బాగు చేయిస్తే వినియోగంలోకి వస్తాయని చెప్పడంతో అన్నింటిని బయటకు తీయించారు.



మరమ్మతులకు నోచుకోని ఆర్థోపెడిక్ సీయామ్ మిషన్

● వినియోగంలోకి వస్తే ఎంతో మేలు...

మూలకు పడ్డ యంత్రాలలో ప్రధానమైనవి వెంటిలేటర్లు 30. సి పాప్ మిషన్లు 40 వరకు ఉన్నాయి. వాటిని బాగు చేయిస్తే ఐసీయూతో పాటు ఇతర వార్డుల్లో కూడా వెంటిలేటర్ సౌకర్యాన్ని కల్పించే అవకాశం ఉంది. దీంతో పాటు 400 ఎంఏ సామర్థ్యం గల ఎక్స్‌రే మిషన్‌ను బాగుచేయిస్తే రోజుకు వందల ఎక్స్‌రేలు చేసేందుకు అవకాశం ఉంటుంది. దీని వలన రోగులకు వేగవంతంగా వైద్యసేవలు అందించవచ్చు. అదేవిధంగా ఆపరేషన్ థియేటర్‌లో ఉండే ఎలక్ట్రిక్ ఓటీ టేబుళ్లు బాగుచేయిస్తే గైనిక్‌తో పాటు జనరల్ సర్జరీలు కూడా రోజుకు వందల్లో చేయవచ్చు. సర్జికల్ మైక్రోస్కోప్‌తో కూడా ఎన్నో ఈఎన్‌టీ సర్జరీలు చేయవచ్చు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిధులు మంజూరు చేస్తే పేద ప్రజలకు మేలు జరిగే అవకాశం లేకపోలేదు.

కాసులు ఇస్తే సై.. లేకుంటే నై

- భూ సర్వే కోసం ఇబ్బంది పడుతున్న బాధితులు
- కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చినా ఫలితం శూన్యం
- భూముల రీ సర్వే మేలంటున్న రైతులు

గద్వాల క్రైం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించడు అన్న చందంగా జోగుళాంబ గద్వాల జిల్లాలో భూ సర్వే అధికారుల పరిస్థితి ఉన్నది. జిల్లాలోని ఉన్నతాధికారులు త్వరగా సర్వే పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేస్తున్నప్పటికీ కిందిస్థాయి సర్వేయర్లు, అధికారుల్లో మార్పు రావడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. ప్రజాప్రతినిధుల అండదండలు ఉన్నవారికి, కాసులు ఇస్తున్న వారికి మాత్రమే సర్వే చేస్తూ రిపోర్టులు ఇస్తున్నారు. సామాన్యులను మాత్రం సంవత్సరాల తరబడి చెప్పులు అరిగేలా తిప్పుకుంటున్నారని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాసులు ఇచ్చిన వారికి సై అంటున్నారు... లేదంటే నై అంటున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. కొందరు అధికారులు డబ్బులు తీసుకొని కూడా సర్వే చేయడం లేదని తహసీల్దార్, కలెక్టర్ కార్యాలయాల ముందు ఆత్మహత్యయత్నాలు చేసుకున్న సంఘటనలు చోటుచేసుకున్నాయి.

పెండింగ్‌లో ఉన్నవి కేవలం 388

జిల్లాలో 2016, అక్టోబరు 11 నుంచి 2025, ఫిబ్రవరి 8 వరకు అధికారికంగా 21,223 దరఖాస్తులు వచ్చినట్లు జిల్లా సర్వే అధికారులు తెలిపారు. ఇందులో డిస్పోజ్ అయినవి 20,835 కాగా ఇందులో కేవలం 388 మాత్రమే పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రతీ సోమవారం ప్రజావాణికి వచ్చే సమస్యలలో భూ సర్వేకు సంబంధించినవే మళ్లీమళ్లీ వస్తున్నాయి. వచ్చిన దరఖాస్తులు డిస్పోజ్ అవుతున్నాయే కానీ పరిష్కారం మాత్రం కావడంలేదని తెలుస్తోంది. దీంతో రైతులు పదేపదే ప్రజావాణికి రావాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

రీ సర్వే చేయడంతో రైతులకు మేలు..

గతంలో ఉన్న సర్వేలలో ఉన్న తప్పులు, భాగస్వామ్యుల మధ్య సర్వే నంబర్ల తేడాలు, ఒకే భూమిలో వివిధ సర్వేల నంబర్లకు చెక్ పడాలంటే రీసర్వేతోనే సాధ్యం. గతంలో నిజాం ప్రభుత్వం భూములకు రీసర్వే ప్రకారం నంబర్లు ఉండేవని తెలుస్తోంది. అప్పటినుంచి ఇప్పటి వరకు భూములకు రీసర్వే లేకపోవడంతో ఒక సర్వే నంబరుతో అనేక సంఖ్యలు, అ,ఆ,ఇ,ఈలు అంటూ ఉండటంతో ఇబ్బందులు అవుతున్నాయి. రీసర్వే జరిగితే ఒకే భూమిలో 1,2,3,4 ఇలా సంఖ్యలు వస్తాయి కాని ఎక్కడ కూడా బైలు, అక్షరాలు రావని అధికారులు చెబుతున్నారు. ఇటీవలే పైలెట్ ప్రాజెక్టు కింద కొన్ని జిల్లాలకు రీసర్వే అమలు చేస్తున్నారు. అక్కడ సక్సెస్ అయితే ఇక రైతులకు ఇబ్బందులు తొలగుతాయని తెలుస్తోంది.

సర్వే కోసం నవంబరులో ఫీజు చెల్లించాం

ధరూర్ మండలంలోని చింతరేవుల శివారులోని సర్వే నెంబర్లు 691/గ2, 691/గ/1/1, 806గ/2లో ఉన్న మూడు ఎకరాల భూమి సర్వే కోసం గతేడాది నవంబరు 26న మీ సేవలో దరఖాస్తు చేసుకున్నా.. ఇప్పటివరకు సర్వే చేయకపోవడంతో కలెక్టర్, జిల్లా సర్వే అధికారికి ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం. తనలాగే మరికొందరు సంవత్సరాల తరబడి సర్వే కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు.

- వెంకటేష్, చింతరేవుల

దరఖాస్తు చేసుకున్నవారికి సర్వే చేస్తున్నాం



పెండింగ్‌లో ఉన్న వాటిపై ప్రత్యేక దృష్టి సారించి త్వరగా పూర్తి చేయాలని సర్వేయర్లకు ఆదేశాలు జారీ చేశాం. సర్వేకు సంబంధించి బాధితులు నేరుగా రావాలని, దళారులను నమ్మి వారికి డబ్బులు ఇచ్చి మోసపోవద్దు. సర్వే అధికారులు ఎవరూ డబ్బులు తీసుకోవడంలేదు. 45 రోజులలో సర్వే చేసేలా అధికారులకు ఆదేశాలు జారీ చేశాం.

- ఎం. రవీందర్, అసిస్టెంట్ డైరెక్టర్, గద్వాల

శంభో.. శివశంభో

- భక్తులతో కిక్కిరిసిన దక్షిణకాశీ క్షేత్రం
- అభిషేకాలతో అలరారిన బాలబ్రహ్మేశ్వరుడు
- భౌరాపూర్‌లో చెంచుల సంప్రదాయం ప్రకారం భ్రమరాంబికాదేవి కల్యాణం

అలంపూరు/కొత్తకోట/ఖిల్లాఘణపురం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని దక్షిణకాశీ అలంపూరు క్షేత్రంలో బ్రహ్మోత్సవాలు బుధవారం రెండోరోజుకు చేరుకున్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లాలోని అతి పెద్ద క్షేత్రమైన అలంపూరు ఆలయాల్లో ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. పుష్కరఘాట్‌లో పుణ్యస్నానాలు ఆచరించి బాలబ్రహ్మేశ్వర స్వామి, జోగుళాంబ అమ్మవారిని దర్శించుకున్నారు. స్వామి వారి ఆలయంలో అభిషేక పూజలు, అమ్మవారి ఆలయంలో శ్రీ చక్ర పూజలు విశేషంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం 4 గంటల నుంచి బాలబ్రహ్మేశ్వరుడి గర్భాలయంలో భక్తులు నిరంతరంగా అభిషేకాలు చేశారు. ఆలయంలో ఏర్పాటు చేసిన యాగశాలలో ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి 9 గంటల నుంచి యమకాల పూజలు చేశారు. ఆలయంలో అర్ధరాత్రి లింగోద్భవ కాలంలో శివజ్యోతి పేరిట శివస్వాములు ఆకాశ జ్యోతిని ఎగురవేశారు.

భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు..

ఆలయ అధికారులు భక్తుల కోసం ప్రత్యేక క్యూలైన్‌లు ఏర్పాటు చేశారు. క్యూలైన్‌లలో ఉన్న భక్తులకు ఎండతాపం లేకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. తాగునీటి వసతితో పాటు మజ్జిగ ప్యాకెట్లను అందించారు. స్థానిక స్వామి వివేకానంద యూత్ సొసైటీ అధ్యక్షుడు బుజ్జి యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అల్పాహారం కార్యక్రమాన్ని తహసీల్దార్ మంజుల ప్రారంభించారు. అదేవిధంగా పలు సేవా, స్వచ్ఛంద సంస్థలు భక్తులకు అల్పాహారం, తాగునీరు అందించారు. తిరిగి సాయంత్రంనుంచి జాగరణ కోసం వచ్చే భక్తులతో ఆలయ ప్రాంగణాలు కిక్కిరిశాయి. పోలీసులు కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. డీఎస్పీ వై మొగిలయ్య, సీఐ రవిబాబు, స్థానిక ఎస్ఐ వెంకటస్వామి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఆకాశజ్యోతి దర్శనం...

బాలబ్రహ్మేశ్వరుడి క్షేత్రమైన అలంపూరులో బుధవారం అర్ధరాత్రి మహా శివరాత్రిని పురస్కరించుకొని ఆకాశజ్యోతి దర్శన భాగ్యం కలిగింది. ఓం నమఃశివాయ అంటూ శివస్వాములు పంచాక్షరి నామస్మరణతో ఆకాశజ్యోతిని నింగిలోకి వదిలారు. ఆకాశ జ్యోతిని తిలకించడానికి శివస్వాములు, భక్తులు వేలాదిగ తరలి రావడంతో ఆలయ ప్రాంగణంలో భక్తుల సందడి నెలకొంది.

కొత్తకోటలో..

వనపర్తి జిల్లాలోని శైవక్షేత్రాలు బుధవారం మహాశివరాత్రిని పురష్కరించుకొని భక్తులతో కిటకిటలాడాయి. కొత్తకోట పట్టణంలోని పాత శివాలయం, భవానీ శంకర, భక్త మార్కండేయస్వామి ఆలయాలతో పాటు కానాయపల్లి, పామాపురం గ్రామ సమీపంలోని కోటిలింగేశ్వరస్వామి, భ్రమరాంబ రామేశ్వరస్వామి ఆలయాలోని శివలింగాలను దర్శించుకోవడానికి భక్తులు భారీగా తరలి వచ్చారు. కోటిలింగేశ్వరస్వామి, రామేశ్వరస్వామి దేవాలయాల్లో భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని ప్రత్యేక క్యూలైనులను ఏర్పాటు చేశారు. రామేశ్వరస్వామి దేవాలయం సమీపంలో ఊకశెట్టి వాగులోని 36 అడుగుల శివుడి దర్శనం కోసం భక్తులు భారీగా తరలివచ్చారు. అయా ఆలయాల్లోని శివపార్వతుల ఉత్సవ విగ్రహాలకు కల్యాణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కొత్తకోట శివారులోని బ్రహ్మంగారి దేవాలయంలో శివరాత్రి సందర్భంగా వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండల కేంద్రంలోని ఎత్తైన కొండ వెంకయ్య గట్టుపై శివరాత్రి సందర్భంగా భక్తులు అఖండ జ్యోతిని వెలిగించి దర్శనం చేసుకున్నారు.



కొత్తకోట మండల కానాయపల్లి కోటిలింగేశ్వర స్వామిని దర్శనం చేసుకుంటున్న భక్తులు



ఖిల్లాఘణపురం వెంకయ్య గట్టుపై సూర్యాస్తమయం తరువాత జ్యోతి ప్రజ్వలన చేసిన భక్తులు



వనపర్తి ఆలయంలో వాణేలు నిలబెడుతున్న మహిళలు

భక్తిశ్రద్ధలతో
భ్రమరాంబ కల్యాణం

అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించిన ఎమ్మెల్యే దంపతులు

మన్ననూర్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రిని పురస్కరించుకొని నాగర్‌కర్నూలు జిల్లా లింగాల మండల భౌరాపూర్‌లో భ్రమరాంబికా దేవి (భౌరమ్మ), శివయ్యల కల్యాణాన్ని బుధవారం చెంచుల సంప్రదాయాల ప్రకారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన భ్రమరాంబ మల్లికార్జున స్వామి కల్యాణోత్సవానికి ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, అనురాధ దంపతులు, అదనపు కలెక్టర్ అమరేందర్ దంపతులు ముఖ్య అతిథులుగా హాజరై దేవతా మూర్తులకు పట్టు వస్త్రాలు సమర్పించారు. మొదట ఆలయ సమీపంలోని చెరువు కట్టపై ఎదుర్కోళ్ల కార్యక్రమాన్ని చెంచు మహిళల సంప్రదాయ నృత్యాల నడుమ నిర్వహించారు. ఉత్సవమూర్తులను ఊరేగింపుగా తీసుకొని వచ్చి ఆలయ ప్రాంగణంలోని కల్యాణ పండపం వద్దకు తీసుకు వచ్చారు. ఆలయ ప్రాంగణంలో చెంచు పూజారులు తోకల చిన్నమల్లయ్య, చిగుర్ల లింగయ్యల ఆధ్వర్యంలో శివయ్య భ్రమరాంబల వివాహ ఘట్టంలో జీలుకర బెల్లం పెట్టి కన్యాదానం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం భక్తులు తంబ్రాలు వేసి మొక్కుకున్నారు. అంతకుముందు ఎమ్మెల్యే దంపతులు భ్రమరాంబ, మల్లికార్జున స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఒకే రోజు అనుమతి ఉండడంతో భౌరాపూర్‌కు బుధవారం రాత్రి దాకా వేలాది మంది భక్తులు తరలివచ్చారు. అనంతరం ముఖ్య అతిథులను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. చెంచుల జాతర ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్టాళ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో డీటీడీవో ఫిరంగి, ఆర్డీవో మాధవి, అటవీశాఖ ఎఫ్‌డీవో రామమూర్తి, జీసీసీ మేనేజరు సంతోష్, ఐటీడీఏ ఏవో జాఫర్ హుసేన్, ఐకేపీ డీపీఎం లక్ష్మయ్య, ఏసీఎంవో తిరుపతయ్య చెంచు సంఘాల నాయకులు తోకల గురువయ్య, శంకరయ్య, లింగస్వామి, దాసరి శ్రీనివాసులు, రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

రూ.100 కోట్లతో పర్యాటక హబ్‌గా నల్లమల

అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాబోయే రోజుల్లో నల్లమల అభివృద్ధికి రూ.100 కోట్ల నిధులు కేటాయించి పర్యాటక హబ్‌గా తీర్చిదిద్ది చెంచులకు ఉపాధి అవకాశాలు కల్పించేందేకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆలయ ప్రహరీ నిర్మాణానికి తన నిధుల నుంచి రూ.10 లక్షలు కేటాయించనున్నట్లు తెలిపారు. ఆలయం లో నిత్య పూజలు జరిగేలా చెంచు పూజారులకు దూపదీప నైవేద్య పథకాన్ని అమలు చేయించనున్నట్లు తెలిపారు. నల్లమలలోని మరో శైవ క్షేత్రం సలేశ్వర లింగమయ్య ఆలయాన్ని ఏడాదిలో 9 నెలల పాటు భక్తులు దర్శించుకునేలా టూరిజం ప్యాకేజీ ఏర్పాటు చేస్తామని తెలిపారు.



పర్వాబాద్ చౌరస్తా వద్ద భౌరాపూర్ వెళ్లే వాహనాల రద్దీ



భౌరాపూర్‌లో కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు



భ్రమరాంబికా మల్లికార్జున స్వామివార్లకు తలంబ్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, అదనపు కలెక్టర్ అమరేందర్ దంపతులు

డివైడర్‌ను ఢీకొని కారు బోల్తా

» స్వల్ప గాయాలతో బయటపడ్డ ముగ్గురు యువకులు



డివైడర్‌ను ఢీకొని బోల్తా పడిన కారు

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : తెల్లవారుజామున మసక వెలుతురు.. జనం అప్పుడే వాకింగ్ కోసం రోడ్డుపైకి వస్తున్నారు... ఇంతలో హైదరాబాద్ నుంచి నగరంలోకి వస్తున్న కారు డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. కారు బాగా దెబ్బతిన్నా, అందులోని ముగ్గురు సురక్షితంగా బయట పడ్డారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఈ సంఘటన జరిగింది. పట్టణంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉంటున్న మహమూద్, నరేశ్‌లతో పాటు మరో యువకుడు బుధవారం తెల్లవారుజామున 4:20 గంటల సమయంలో హైదరాబాద్ నుంచి మహబూబ్‌నగర్‌కు బయలుదేరారు. అప్పన్నపల్లి ఫ్లైఓవర్ దిగిన తరువాత, పిస్తా హౌస్ వద్ద కారు చక్రం పంక్చర్ కావడంతో డివైడర్‌పై నున్న బారికేడ్లను ఢీకొని, అవతలి వైపు రోడ్డుపై బోల్తా పడింది. అదే క్షణంలో బెలూన్లు తెరుచుకోవడంతో కారులోని ముగ్గురు యువకులు స్వల్పంగా గాయపడ్డారు. చుట్టుపక్కల ఉన్న స్థానికులు వారిని కారులోనుంచి బయటకు లాగారు. కారును అద్దెకు తీసుకొని, స్నేహితుడిని హైదరాబాద్‌లో వదిలి వస్తున్నట్లు బాధితులు తెలిపారు. కారు టైర్ పంక్చర్ కావడంతో ప్రమాదం జరిగిందని తెలిపారు. అయితే డ్రైవర్ నిద్రలోకి జారుకోవడం వల్లే కారు అదుపు తప్పిందన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కారు ముందు భాగంతో పాటు, రెండు డోర్లు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. డివైడర్‌పై ఉన్న చెట్లు కూలిపోయాయి.

బస్సు కిందపడి బాలుడి మృతి

» తండ్రితో కలిసి బైక్‌పై శ్రీశైలానికి వెళ్తుండగా ప్రమాదం

దోమలపెంట, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైలం మల్లికార్జున స్వామి దర్శనానికి వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ బాలుడు మృతి చెందాడు. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలంలోని వటువర్లపల్లి సమీపంలో ఈ సంఘటన జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అచ్చంపేట మండల పరిధిలోని నడింపల్లి గ్రామానికి చెందిన కృష్ణయ్య తన కుమారుడు బొడ్డ అరుణ్‌కుమార్ (16)తో కలిసి ద్విచక్రవాహనంపై బుధవారం శ్రీశైల క్షేత్రానికి బయలుదేరారు. వట్టవర్లపల్లి దాటిన తర్వాత తవిసిపెంట వద్ద ముందు వెళ్తున్న బస్సును ఓవర్‌టేక్ చేస్తుండగా, ఎదురుగా ఆటో వచ్చింది. దీంతో కృష్ణయ్య బైక్‌కు సడన్‌బ్రేక్ వేయడంతో వెనుక కూర్చున్న అరుణ్‌కుమార్ పట్టు తప్పి ఆర్టీసీ బస్సు కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వీరమల్లు తెలిపారు.

మహిళ దారుణ హత్య

భూత్పూర్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, భూత్పూర్‌లో ఓ మహిళ దారుణ హత్యకు గురయ్యింది. మునిసిపాలిటీ పరిధిలోని 44వ నెంబర్ జాతీయ రహదారి పక్కనున్న మునిరంగస్వామి దేవాలయం వద్ద ఈ సంఘటన జరిగింది. సీఐ రామకృష్ణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కొత్తమొల్గర గ్రామానికి చెందిన ఆనెగాళ్ల రంగమ్మ (50)కు కల్లుతాగే అలవాటు ఉంది. అందుకోసం ఆమె తరచూ బయటకు వెళ్లి వచ్చేది. అలాగే ఈ నెల 25న కుమార్తె ఇంటికి పోతున్నానని చెప్పి వెళ్లిన ఆమె 26వ తేదీన భూత్పూర్ మునిరంగస్వామి దేవాలయ ప్రాంగణంలో రక్తపు మడుగులో పడి ఉంది. ఆలయ పూజారి ఒకరు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వెంటనే అక్కడికి చేరుకున్నారు. తలపై తీవ్ర గాయాలు, కాళ్లు, చేతులు విరిగిపోయి కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతూ ఉన్న ఆమెను హుటాహుటిన జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రంగమ్మ మృతి చెందింది. విషయాన్ని తెలుసుకున్న ఆమె భర్త ఆనెగాళ్ల సాయిలు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకొని భార్య మృత దేహాన్ని చూసి బోరున విలపించాడు. వారికి ఆరుగురు కుమార్తెలు, ఒక కూమారుడు ఉన్నారు. సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లుగా సీఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

హన్వాడ, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్‌ఐ వెంకటేశ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా, హన్వాడ మండలంలోని నాయినోనిపల్లి గ్రామానికి చెందిన పల్లె సత్యయ్య (57) కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. దీంతో మనస్తాపానికి గురై ఈ నెల 25న ఇంట్లో పురుగుల మందు తాగాడు. కుమారుడు గమనించి అతడిని జిల్లా ఆసుపత్రికి తరలించాడు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు చెప్పారు.

మహిళపై తేనెటీగల దాడి

ఖిల్లాఘణపురం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : తేనెటీగల దాడిలో ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. వనపర్తి జిల్లా, ఖిల్లాఘణపురం గ్రామానికి చెందిన బుడ్డమ్మ శివరాత్రి సందర్భంగా బుధవారం ఉదయం ఘన లింగేశ్వరస్వామి ఆలయానికి వెళ్లింది. దైవదర్శనం అనంతరం సమీపంలోని చెట్టుకింద కూర్చున్న ఆమెపై తేనెటీగలు ఒక్కసారిగా దాడి చేశాయి. ఆమె మొఖం మొత్తం తేనెటీగల ముళ్లతో నిండిపోయింది. సమీపం లోని భక్తులు ఆమెను మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం, మెరుగైన వైద్యం కోసం మహబూబ్‌నగర్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. మరో మహిళపై కూడా తేనెటీగలు దాడి చేయడంతో స్వల్పంగా గాయపడింది. అన్నదానం సమయంలోనూ తేనెటీగలు రావడంతో భయాందోళనలకు గురైనట్లు భక్తులు తెలిపారు.

చెరువులో పడి యువకుడి మృతి

మన్ననూర్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, నల్లమల అటవీ ప్రాంతంలోని భౌరాపూర్ చెరువులో పడి ఓ యువకుడు మృతి చెందాడు. బల్మూరు మండలం బిల్లకల్ గ్రామానికి చెందిన అంజనేయులు (30) భౌరాపూర్ జాతరకు వచ్చాడు. ఈ సందర్భంగా సమీపంలోని చెరువులో ఈత కొట్టేందుకు కట్టపై నుంచి లోనికి దూకాడు. లోపలున్న బురదలో చిక్కుకొని బయటకు రాలేక మృతి చెందాడు. స్థానికులు అతడి మృతదేహాన్ని బయటికి తీసి బిల్లకల్ గ్రామానికి పంపించారు.

మద్యం మత్తులో పురుగుల మందు తాగిన వ్యక్తి

» ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి

నాగర్‌కర్నూల్ క్రైం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో పురుగుల మందు తాగిన ఓ వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీ పరిధిలోని దేశిటిక్యాలకు చెందిన మినుగల ఆనంద్(40) మంగళవారం మద్యం మత్తులో పొలంలో ఉన్న పురుగుల మందు తాగి పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. అతడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

పీపనగండ్ల, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, పీపనగండ్ల మండల కేంద్రానికి చెందిన బండారి వీరస్వామి కనిపించకుండా పోయినట్లు ఎస్‌ఐ రాణి తెలిపారు. ఆయన ఈ నెల 23న పీపనగండ్ల నుంచి శ్రీశైలానికి పాదయాత్రగా వెళ్తున్న శివస్వాములతో కలిసి వెళ్లారు. గ్రామం దాటి కొంత దూరం వెళ్లిన తర్వాత, నడవలేకపోతున్నానని చెప్పి వెనుదిరిగాడు. కానీ ఇప్పటివరకు ఇల్లు చేరలేదు. దీంతో తండ్రి స్వామి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

టోర్నీలో సత్తా చాటాలి

» బాస్కెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా ప్యాట్రన్ మనోహర్‌రెడ్డి

» మహబూబ్‌నగర్ పట్టణంలో రాష్ట్ర బాల, బాలికల జట్ల ఎంపిక పోటీలు



ఎంపిక పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ టోర్నీలో రాష్ట్ర జట్టు క్రీడాకారులు సత్తా చాటాలని బాస్కెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా ప్యాట్రన్ మనోహర్‌రెడ్డి అన్నారు. పుదుచ్చేరిలో ఏప్రిల్ 9 నుంచి 16వ తేదీ వరకు నిర్వహించనున్న 40వ యూత్ నేషనల్ బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే రాష్ట్ర జట్టు సెలక్షన్ కమ్ ట్రయల్స్ బుధవారం స్థానిక ఇండోర్ స్టేడియంలో నిర్వహించారు. ఎంపిక పోటీలను ఒలింపిక్ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎన్‌పీ వెంకటేశ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. జిల్లా క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తున్నారని గుర్తు చేశారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మక్సూద్‌బిన్ అహ్మద్ జాకీర్ మాట్లాడుతూ ఎంపిక పోటీలకు వివిధ జిల్లాల నుంచి 80 మంది బాలికలు, 110 మంది బాలురు హాజరైనట్లు తెలిపారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారిని ప్రాబబుల్స్‌కు ఎంపిక చేశామన్నారు. వారికి శిక్షణ శిబిరం నిర్వహించి తుది జట్టును ప్రకటిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నసూరుల్లా హైదర్ మహ్మద్, వైస్ ప్రెసిడెంట్ సుభాహన్‌జీ, ఆర్గనైజింగ్ సెక్రటరీ మీర్ ఖలీద్‌అలీ, అసోసియేట్ సెక్రటరీ మీర్ అర్షద్ అలీ, జాయింట్ సెక్రటరీలు మహ్మద్ ఇలియాజ్, గోపాల కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కుక్కల బెడదతో... భయం భయం



» వీధిలోకి రావాలంటే వణుకుతున్న చిన్నారులు » మొన్న అయిజలో, నిన్న అలంపూర్‌లో వరుస దాడులు

» కుక్కకాటుతో రేబిస్ వ్యాధి సోకి మృతి చెందిన బాలుడు » ఆందోళన చెందుతున్న ప్రజలు





అయిజ పట్టణంలో గుంపులుగా తిరుగుతున్న కుక్కలు, క్యాతూరులో రేబిస్ వ్యాధితో మృతి చెందిన హర్షవర్ధన్ (ఫైల్)

అయిజ టౌన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, అయిజ, అలంపూర్ పట్టణాల్లో వీధి కుక్కల బెడద తీవ్రమైంది. ఎక్కువగా చిన్నపిల్లలపై దాడులు చేస్తుండటం ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పిల్లలను ఆడుకునేందుకు బయటకు పంపించాలంటేనే భయపడుతున్నారు. తమ పిల్లలు పాఠశాలలకు వెళ్లి ఇంటికి వచ్చేంతవరకు గుండె చిక్కబట్టుకొని కాలం గడుపుతున్నారు. గత 22న అలంపూర్ మండలంలోని క్యాతూరు గ్రామానికి చెందిన నాలుగేళ్ల బాలుడు హర్షవర్ధన్‌ను కుక్క కరిచింది. వైద్యులు సకాలంలో స్పందించి చికిత్స చేయకపోవడంతో రేబిస్ వ్యాధి సోకడంతో నెల రోజుల తర్వాత కర్నూల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.

అదే విధంగా ఈనెల 6న అయిజ పట్టణంలో ఆరు బయట ఆడుకుంటున్న అయిదుగురు పిల్లలపై పిచ్చికుక్క దాడి చేసింది. హరికృష్ణ అనే బాలుడి చేతి బొటనవేలిని కొరికేసింది. బాలుడిని కాపాడేందుకు యత్నించిన యువకుడిపైనా అది దాడి చేసింది. వారందరూ అయిజ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందారు. తీవ్రంగా గాయపడిన హరికృష్ణను మెరుగైన చికిత్స కోసం కర్నూల్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అయిదు రోజుల చికిత్స కోసం రూ. 50 వేలు అప్పు చేసి ఖర్చు పెట్టినట్లు బాలుడి తండ్రి మద్దిలేటి వాపోయారు. ఇలాంటి సంఘటనలు తరుచూ జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంపై అయిజ మునిసిపల్ కమిషనర్ సైదులును 'ఆంధ్రజ్యోతి' వివరణకోరింది. పట్టణంలో వీధికుక్కల నియంత్రణకు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ప్రత్యేక కార్యాచరణ చేపట్టి వీధి కుక్కలను పట్టుకొని పట్టణానికి దూరంగా వదిలేస్తామని చెప్పారు.

హరీశ్‌రావు వాస్తవాలు తెలుసుకోవాలి

» రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి

వనపర్తి అర్బన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఖర్చు పరిమితిపై బీఆర్ఎస్ నాయకుడు, ఎమ్మెల్యే హరీశ్‌రావు వాస్తవాలు తెలుసుకోవాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి అన్నారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని తన నివాసంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత, స్థానిక సంస్థల ఉప ఎన్నికల్లో పార్టీ తరఫున పోటీ చేసిన అభ్యర్థి మన్నె జీవన్‌రెడ్డి ఎన్నికల్లో ఖర్చు చేసిన దానిపై తాను మూడు రోజుల క్రితం మీడియాతో మాట్లాడినట్లు తెలిపారు. దానికి సంబంధించిన వీడియోను హరీశ్‌రావు సోషల్ మీడియాలో పోస్టు చేయడాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థి ఖర్చుపై ఎలాంటి పరిమితులూ ఉండవన్నారు. ఎవరో చెప్పిన విషయాన్ని నమ్మి వీడియోను పోస్ట్ చేయడం బాధాకరమన్నారు. అనుభవం ఉన్న నాయకులే ఇలా చేస్తే రాజకీయాల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఇటీవల నేను చేసిన అభివృద్ధి ఆరోపణలపై గోపాల్‌పేట మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు స్పందించారని, వారు మాట్లాడిన మాటలు అవాస్తవం అన్నారు. ఆ మాటలను వారి విజ్ఞతకే వదిలేస్తున్నట్లు చెప్పారు. పార్టీ నాయకుడు సత్యశీలారెడ్డి, ఆయన సతీమణి, మాజీ ఎంపీపీ ప్రభావతిలకు రాజకీయాల్లో తాను చేసిన సేవలు అందరికీ తెలుసన్నారు. వచ్చే నెల 2న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వనపర్తికి రానున్నారని తెలిపారు. రూ.1000 కోట్ల ప్రతిపాదనలను ఇప్పటికే ఎమ్మెల్యే మేఘారెడ్డి, ఎంపీ మల్లు రవి సీఎంకు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రాజేంద్రప్రసాద్, బీకృష్ణ, పరశురామ్, కమ్మర్‌మియా, పెంటన్న యాదవ్ పాల్గొన్నారు.

నకిలీ ధ్రువపత్రాల సృష్టికర్త అరెస్టు

» మిర్యాలగూడలోని ఓ ప్రైవేట్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పని చేసిన రామకృష్ణ

» 12 మందికి నకిలీ సర్టిఫికెట్లు ఇచ్చినట్లు గుర్తింపు » వివరాలు వెల్లడించిన డీఎస్పీ మొగులయ్య


National Institute of Open Schooling
MARKS STATEMENT
SENIOR SECONDARY SCHOOL EXAMINATION

పోలీసులు స్వాధీనం చేసుకున్న నకిలీ సర్టిఫికెట్

గద్వాల క్రైం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : నకిలీ ధ్రువపత్రాల కేసు కీలక మలుపు తిరిగింది. మిర్యాలగూడకు చెందిన ఓ ప్రైవేట్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్‌ను పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుంచి నకిలీ సర్టిఫికెట్లను స్వాధీనం చేసుకొని, రిమాండ్‌కు పంపించినట్లు డీఎస్పీ మొగులయ్య తెలిపారు. జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని పట్టణ పోలీస్‌స్టేషన్లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నకిలీ ధ్రువపత్రాలతో వ్యవసాయ శాఖలో ఉద్యోగాలకు సంబంధించిన కేసులో ఇటీవల అచ్చంపేటకు చెందిన నరేశ్, నాగరాజులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వారిచ్చిన సమాచారం మేరకు మిర్యాలగూడలోని సాక్షి డిగ్రీ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ బాలకృష్ణను అరెస్ట్ చేసి విచారించారు. అతడి నుంచి మరికొన్ని ధ్రువపత్రాలను స్వాధీనం చేసుకున్నారు. అతడు పదేళ్ల క్రితం ప్రిన్సిపాల్‌గా పని చేశాడు. ఆర్థిక సమస్యలు చుట్టుముట్టడంతో ఉద్యోగాన్ని వదిలేశాడు. జల్సాలకు అలవాటు పడిన ఆయన డబ్బు సంపాదనకు అక్రమాల బాట పట్టాడు. అందుకోసం నకిలీ ధ్రువపత్రాల తయారీని ఎంచుకున్నాడు. ఈ క్రమంలో పొరుగు రాష్ట్రానికి చెందిన ఓ పెద్దమనిషితో ఒప్పందం కుదుర్చుకొని లక్షల రూపాయలు గడించాడు. అతడు ఇప్పటివరకు 12 నకిలీ ధ్రువపత్రాలు సృష్టించగా, వాటిలో 5 సర్టిఫికెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన వాటిని త్వరలోనే స్వాధీనం చేసుకుంటామని డీఎస్పీ తెలిపారు. బాలకృష్ణ గత పదేళ్లుగా ఎంత మందికి నకిలీ ధ్రువపత్రాలు ఇచ్చారనే విషయంపై విచారణ చేపడుతున్నామన్నారు. బాలకృష్ణతో పాటు నరేశ్, నాగరాజుల దగ్గర కొందరు ఏజెంట్లు ఉన్నారని, వారి ద్వారా నకిలీ ధ్రువపత్రాలు ఎవరెవరికి ఇచ్చారనే విషయంపై ఆరా తీస్తున్నామని చెప్పారు. వీటిని ఎక్కువగా వ్యవసాయ శాఖలో ఉద్యోగాలకే ఉపయోగించారని తెలిపారు. అయితే బాలకృష్ణ ఏజెంట్ మాత్రమేనని, ఆయన వెనుక మరికొందరు కీలక పాత్ర పోషించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయన్నారు. విలేకరుల సమావేశంలో సీఐ టంగుటూరి శ్రీను, గద్వాల పట్టణ ఎస్‌ఐ కల్యాణ్‌కుమార్ పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వల్లే ఎస్‌ఎల్‌బీసీ ఘటన

» సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సాగర్



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సాగర్

పాలమూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్లే ఎస్‌ఎల్‌బీసీ ఘటన జరిగిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు టి.సాగర్ విమర్శించారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో బుధవారం జరిగిన సీపీఎం జిల్లా కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందు జాగ్రత్త చర్యలు తీసుకోకుండా టన్నెల్ తవ్వారని, అందుకోసం నిపుణుల సూచనలు, సలహాలు ఉంటే ఎందుకిలా జరిగిందో ప్రభుత్వం పరిశీలించాలన్నారు. ఉదండాపూర్ నిర్వాసితుల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం చేసిన విషయంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను మభ్య పెడుతున్నారని ఆరోపించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం విస్తృత పోరాటాలు నిర్వహించాలని నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. క్షేత్రస్థాయిలో పర్యటించి ఆరు గ్యారెంటీలు, రెండు లక్షల రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్లు, స్థానిక సమస్యలపై సర్వేలు నిర్వహించాలని, ప్రజానీకాన్ని కదిలించి పోరాటాల్లో భాగస్వాములను చేయాలని సూచించారు. సమావేశంలో నల్లవెల్లి కురుమూర్తి, వి.పద్మ, కె.మోహన్, చంద్రకాంత్, రాజ్‌కుమార్, జగన్, దీప్లానాయక్, నరసింహులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో సరిహద్దు పంచాయితీ

» ఆలయ బోర్డుపై ఊరి పేరు కోసం గొడవ » కుమ్మెర, కారుకొండ గ్రామస్థుల మధ్య వాగ్వాదం



ఆలయం వద్ద వాగ్వాదానికి దిగిన కుమ్మెర, కారుకొండ గ్రామస్థులు

బిజినేపల్లి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : బ్రహ్మోత్సవాల సందర్భంగా రెండు గ్రామాల మధ్య సరిహద్దు పంచాయితీ తలెత్తింది. నాగర్‌కర్నూల్ జిల్లా, బిజినేపల్లి మండలం కారుకొండ, నాగర్‌కర్నూల్ మండలంలోని కుమ్మెర గ్రామాల సరిహద్దులోని మల్లయ్య గుట్టపై భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఆలయం ఉంది. ప్రతీ సంవత్సరం శివరాత్రి సందర్భంగా ఇక్కడ బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. ఈ ఏడాది ఉత్సవాల సందర్భంగా మల్లయ్య గుట్టపైకి వెళ్లే మెట్ల వద్ద ఆలయానికి సంబంధించి బోర్డు ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ తూకారాం రెడ్డి దానిపై కుమ్మెర గ్రామం పేరు రాయించారు. అయితే దేవుడు కుమ్మెర గ్రామ శివారులో ఉన్నా, జాతర తమ గ్రామ శివారులో జరుగుతుందని కారుకొండ గ్రామస్థులు వాగ్వాదానికి దిగారు. తమ ఊరి పేరు కూడా రాయించాలని డిమాండ్ చేశారు. వాగ్వాదం తీవ్రం కావడంతో ఇరు గ్రామాల పెద్దలు జోక్యం చేసుకున్నారు. ఎంపీటీసీ మాజీ సభ్యుడు సంతోష్ రెడ్డి, మిద్దె మల్లేష్, మాజీ సర్పంచ్ మోహన్ రెడ్డి, ఎర్ర శ్రీనివాసుగౌడ్, నరేందర్ రెడ్డి, వెంకట్రావు, కల్లు శ్రీనివాస్ గౌడ్ ఇరు గ్రామాల ప్రజలతో మాట్లాడారు. బోర్డుపై ఏగ్రామం పేరు కూడా రాయకూడదని నిర్ణయించారు. బ్రహ్మోత్సవాలను ప్రశాంతంగా కొనసాగించాలని ఇరు గ్రామస్థులకు నచ్చ చెప్పడంతో దీంతో వివాదం సద్దుమణిగింది.

మూడవ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు

మహాశివరాత్రి సందర్భంగా బుధవారం నుంచి వచ్చేనెల మూడవ తేదీ వరకు బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ తూకారం రెడ్డి తెలిపారు. 28న మల్లయ్య గుట్టు చుట్టూ బండ్ల ఊరేగింపు, బోనాలు, రాత్రికి యాదవుల ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. వచ్చేనెల 1వ తేదీ ఉదయం 11 గంటలకు బిందె సేవ, 2న శివపార్వతుల కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. 3వ తేదీన స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తుల ఊరేగింపుతో ఉత్సవాలు ముగుస్తాయని కమిటీ సభ్యులు తెలిపారు.

వైభవంగా సిద్ధేశ్వర స్వామి ఉత్సవాలు

» కనుల పండువగా శివపార్వతుల కల్యాణం



స్వామి ఉత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే, భక్తులు

మద్దూర్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా, మద్దూరు మండలంలోని నాగిరెడ్డిపల్లి శివారులో వెలసిన సిద్ధేశ్వరస్వామి ఉత్సవాలు వైభవోపేతంగా కొనసాగుతున్నాయి. మూడు రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాలు ప్రతీ శివరాత్రిన ప్రారంభమవుతాయి. బుధవారం మహా శివరాత్రి సందర్భంగా శివపార్వతుల కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయం నుంచి పల్లకీ సేవ నిర్వహించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఉత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి, కమిటీ సభ్యులు గోపాల్, గ్రామ మాజీ సర్పంచ్ కృష్ణనాయక్, గ్రామస్థులు, వివిధ గ్రా మాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

ఆకట్టుకున్న తోలు బొమ్మలాట



కొనసాగుతున్న తొలుబొమ్మలాట

రాజోలి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, రాజోలి మండల కేంద్రంలో మంగళవారం రాత్రి ఏర్పాటు చేసిన తోలు బొమ్మలాట అందరినీ ఆకట్టుకున్నది. పెద్దమ్మ తల్లి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ ప్రదర్శనను చూసేందుకు వందలాది మంది తరలి వచ్చారు. కడప జిల్లా నుంచి వచ్చిన కళాకారులు ప్రదర్శించిన తోలు బొమ్మలాటను స్థానిక పెద్దలతో పాటు, యువతీ, యువకులు, చిన్నారులు ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, గోపాల్, గంగిరెడ్డి, జయన్న గౌడు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

'పది' విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం

● ఎంఈవో గాయత్రి



ధన్వాడ, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి వార్షిక పరీక్షలకు సంబంధించి అన్ని ఉన్నత పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని ఎంఈవో గాయత్రి తెలిపారు. పాఠశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించడంలో భాగంగానే ప్రత్యేక తరగతులు కొనసాగిస్తున్నామని బుధవారం ఆమె 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు.

పదో తరగతి విద్యార్థులకు సిలబస్ పూర్తి అయ్యిందా?

సిలబస్ పూర్తి అయ్యింది. ప్రత్యేక తరగతులు నిర్వహించి స్టడీ అవర్స్‌ను నిర్వహిస్తున్నాం.

మీ బడిలో పదో తరగతి విద్యార్థులకు సబ్జెక్టుల్లో వచ్చే సందేహాలను నివృత్తి చేస్తున్నారా?

మా బడి బాలికల ఉన్నత పాఠశాలలో పరీక్షలకు సిద్ధమవుతున్న పదో తరగతి విద్యార్థులకు ఎప్పటికప్పుడు అన్ని సూచనలు, సలహాలు ఇస్తున్నాం.

పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు మీరిచ్చే సలహా?

పరీక్షల కన్నా ముందే విద్యార్థులు అన్ని సబ్జెక్టుల్లో పట్టు సాధించాలి. పరీక్షల సమయంలో ఏ మాత్రం భయపడకుండా పరీక్షలు రాయాలి.

మండలంలో ఎక్కడెక్కడ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. అన్నిచోట్ల ప్రత్యేక తరగతులు కొనసాగుతున్నాయా?

కిష్టాపూర్, కొండాపూర్, గున్ముక్ల, గోటూర్, ధన్వాడ బాలుర, బాలికల, ఉర్దూ మీడియం, ఆదర్శ పాఠశాల, కొండాపూర్ ఎస్టీ రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు కొనసాగుతున్నాయి.

న్యూస్ బాక్స్

నేడు ఎంపీ రాక

నారాయణపేట, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట పట్టణంలోని శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో గురువారం సాయంత్రం 5:30 గంటలకు పాఠశాల 48వ వార్షికోత్సవాన్ని నిర్వహించనున్నామని స్కూల్ అధ్యక్షుడు కొత్తకాపు రతంగ్‌పాండురెడ్డి తెలిపారు. కార్యక్రమానికి మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ ముఖ్య అతిథులుగా రానున్నారని చెప్పారు. వక్తగా విభాగ్ సంచాలక్ శ్రీనివాస్‌రెడ్డి, గౌరవ అతిథులుగా శ్రీనివాసయ్య, మద్ది అనంత్‌రెడ్డి, కుంటి యల్లప్ప, గోపాన్‌బాయి బాల్‌రాజ్ తదితరులు హాజరు కానున్నారని వివరించారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

● ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ బాల్‌రాజ్

నారాయణపేట, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ప్రజలు రోడ్డు భద్రత నియమాలు పాటిస్తూ సైబర్‌నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ బాల్‌రాజ్ అన్నారు. బుధవారం నారాయణపేట పాత బస్టాండ్ చౌరస్తాలో వాహనదారులు, ప్రజలకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. మద్యం తాగి వాహనాలు నడపొద్దన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడపాలన్నారు. అలాగే సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930 టోల్‌ఫ్రీ నెంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసులు రాజు, అంజనేయులు తదితరులున్నారు.

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు

మాగనూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): సంగంబండ రిజర్వాయర్‌లోకి కృష్ణానది నీటిని వదిలి రైతులు వేసుకుంటున్న పంటలను కాపాడుతున్న మక్తల్ ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరికి బుధవారం నేరెడ్‌గం గ్రామ రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు అశోక్‌గౌడ్, ఆనంద్, కాళప్ప, రామకృష్ణ, వెంకటేష్, అంబదాస్, రైతులు ఉన్నారు.

స్నేహితుల బృందంతో నామాజీ శ్రీలంక పర్యటన

నారాయణపేట, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): స్నేహితుల బృందంతో కలిసి బీజేపీ సీనియర్ నాయకుడు నాగురావు నామాజీ శ్రీలంక పర్యటన చేశారు. శ్రీలంక పర్యటనలో భాగంగా బుధవారం సుందరకాండలో వర్ణించిన అశోకవనం, రామాయణ పురాణ ఘట్టం, ఇతిహాసాలను తిలకించారు. అశోకవనంలో సీతమ్మ కూర్చున్న ప్రదేశం, హనుమంతుడు పాదాలు మోపిన పాదముద్ర ప్రదేశం, అగ్నిపరీక్ష గావించిన స్థలాలను తిలకించారు.

మాజీ కౌన్సిలర్ మన్నె వెంకట్రాములు మృతి

నారాయణపేట, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట మునిసిపల్ మాజీ కౌన్సిలర్, రిటైర్డ్ టీచర్ మన్నె వెంకట్రాములు మంగళవారం రాత్రి వయోభారంతో మృతి చెందాడు. బుధవారం ఈయన అంత్యక్రియలు జరిగాయి. ఎందరో విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి ఉత్తమ ఉపాధ్యాయుడిగా కొనసాగి రిటైర్డ్ అయిన తర్వాత ఇండిపెండెంట్ కౌన్సిలర్‌గా గెలుపొంది, బీజేపీలో చేరి రాజకీయంగా ప్రజలకు సేవలు అందించారు. ఆయన మృతి పట్ల పలువురు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.



పేటలో నిర్వహించిన శివపార్వతుల కల్యాణంలో దీక్షిత్ కుటుంబీకులు



పేటలో శివపార్వతుల విగ్రహాలతో భక్తులు

ఘనంగా మహాశివరాత్రి

» శివనామస్మరణలతో మారుమోగిన శివాలయాలు
» శివలింగాలకు అభిషేకాలు » ఉపవాస దీక్షలో భక్తులు

నారాయణపేట/దామరగిద్ద/కోస్గి/మక్తల్/ధన్వాడ/మరికల్/నర్వ/మాగనూరు/కృష్ణ, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా బుధవారం శివరాత్రి వేడుకలను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉపవాస దీక్షలు చేపట్టి దగ్గర్లోని శివాలయాలకు వెళ్లి శివారాధన చేశారు. శివ లింగాలకు రుద్రాభిషేకం, బిల్వార్చన పూజలు నిర్వహించారు. భక్తుల శివనామస్మరణలతో ఆలయాలు కిటకిట లాడాయి. నారాయణపేట మండలం సింగారం గ్రామంలోని ఈశ్వర్‌మందిర్, రామలింగేశ్వర ఆలయం, మల్లికార్జున ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. గురునాథ్‌స్వామి నివాసం నుంచి శివపార్వతుల పల్లకీసేవ ఊరేగింపు పురవీధుల గుండా జరిగింది. మహిళలు హారతులు చేపట్టి దారి పొడవునా నీరు పోస్తు స్వాగతం పలికారు. శివస్వాములు ఖడ్గ విన్యాసాలు చేశారు. కార్యక్రమంలో గురుస్వాములు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే మహా గణపతి ఫౌండేషన్ దీక్షిత్ కుటుంబీకుల ఆధ్వర్యంలో బుధవారం రాత్రి పళ్ల బురుజు లక్ష్మీ గణపతి ఉమా మహేశ్వర దేవాలయం ఆవరణలో ఉమామహేశ్వర కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. గురువారం ఉదయం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కోటకొండలో కాకతీయుల కాలం నాటి భారీ శివ లింగానికి ప్రముఖ న్యాయవాది సీతా రామారావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. రుద్రహోమంతో పాటు విశేష అభిషేకాలు కొనసాగాయి. కార్యక్రమంలో ప్రభంజన్‌రావు, శ్రీనివాస్, భీంసేన్, పద్మనాభరావు, విద్వాన్ జయతీర్థ, శ్రీపాద్, భరత్, శ్రీను తదితరులు పాల్గొన్నారు. పేట బదిగప్పమఠం శివలింగేశ్వర దేవాలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. తెల్లవారుజామునే భక్తులు శివాలయానికి వెళ్లి అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో గందె రవికాంత్, లిఖీ రఘు, హరకంచి రవి, అఖిలభారత అయ్యప్ప దీక్షా ప్రచార సమితి జిల్లా కన్వీనర్ కాకర్ల భీమయ్య తదితరులున్నారు. నారాయణపేటలో బారంబావి శివాలయం, లింగయ్యగుడి, శ్రీతీర్థం, మహంకాళీ రోడ్ శివాలయం తదితర దేవాలయాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.



కోస్గి శివాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న మహిళలు



సింగారంలోని శివాలయంలో లింగం అలంకరణ



ధన్వాడ సూరాన్‌పల్లి ఆలయంలో భక్తులకు పండ్లు పంపిణీ చేస్తున్న యువకులు



మక్తల్‌లోని మల్లికార్జునస్వామి ఆలయంలో క్యూలో ఉన్న భక్తులు

అలాగే, దామరగిద్ద మండలం మద్దెల్‌బీడ్ గ్రామంలోని శివాలయం వద్ద శివస్వాముల ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఆశన్‌పల్లి గ్రామంలో శివనామ స్మరణతో శివపార్వతుల పల్లకీ సేవ ఊరేగింపు నిర్వహించారు.

అదేవిధంగా, కోస్గి పట్టణంలోని తిమ్మన్నబావి శివాంజనేయస్వామి ఆలయం, నీలకంఠస్వామి ఆలయం, ఇంద్రనీల లింగ శివాలయానికి భక్తులు పోటెత్తారు.

మక్తల్ పట్టణంలోని శివాజీనగర్‌లో వెలసిన కుంభేశ్వరాలయంలో శివపార్వతుల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. అలాగే స్థానిక మల్లికార్జునస్వామి ఆలయంలో భక్తుల రద్దీ పెరగడంతో ఆలయం నుంచి రోడ్డు వరకు భక్తులు క్యూ లైన్లలో నిలబడి స్వామివారిని దర్శించుకున్నారు. ఎస్సై భాగ్యలక్ష్మీరెడ్డి పోలీస్ సిబ్బందితో ఆయా ఆలయాల వద్ద బందోబస్తు నిర్వహించారు.

ధన్వాడలోని సురాన్‌పల్లి ఆలయంలో హిందువాహిని యువకులు ఉపవాస దీక్షలు ఉన్న భక్తులకు పాలు, పండ్లు అందించారు. ఆలయ పూజారి వల్కే ఆనంద్ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. వృద్ధామల్లికార్జున ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, గ్రామంలో కలశం ఊరేగించారు. భజనలు, సంకీర్తలతో స్వామివారికి పల్లకీసేవ నిర్వహించారు.

మరికల్‌లోని భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో రాత్రి జాగరణ సందర్భంగా విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు, రాఘవేంద్రచార్యచే ఆధ్యాత్మిక ప్రవచనాలు నిర్వహించనున్నామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

నర్వ, మాగనూరు, కృష్ణ మండల కేంద్రాలతో పాటు, పలు గ్రామాల్లోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కొందరు ఉపవాసాలు ఉండి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు.

రైతుల సంక్షేమానికి కృషి

» ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి



ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిని సన్మానిస్తున్న రైతులు

మక్తల్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. మక్తల్ పట్టణంలోని తన నివాస గృహం వద్ద బుధవారం ఉదయం తనను కలిసిన రైతులతో పలు విషయాలపై ఆయన మాట్లాడారు. జూరాల ప్రాజెక్టులో నీటిమట్టం పడిపోయిందని, భూత్పూర్, సంగంబండ జలాశయాల్లో కూడా నీటిమట్టం గణనీయంగా తగ్గిందన్నారు. దీంతో కర్ణాటక ప్రభుత్వంతో మాట్లాడి నారాయణపూర్ డ్యాం నుంచి ఐదు టీఎంల నీటిని దిగువకు విడుదల చేయించినట్లు తెలిపారు. రిజర్వాయర్ల కింద సాగుచేసిన వరి పంటలు ఎండిపోయే దశలో ఉన్నాయని ఈ తరుణంలో ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకొని నీటిని విడుదల చేయించడంపై రైతులు సంతోషం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేను అభినందించారు. ప్రస్తుతం చిన్నగోప్లాపూర్ పంప్‌హౌజ్ నుంచి భూత్పూర్, సంగంబండ జలాశయాలకు నీటిని విడుదల చేయిస్తున్నట్లు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని కర్ణాటక ప్రభుత్వంతో మాట్లాడడం వల్లనే నీటి విడుదల ప్రారంభమైందన్నారు. రైతులు రవికుమార్, రంజిత్, నర్సింహారెడ్డి, వెంకట్‌రెడ్డి, ఆయా గ్రామాలకు చెందిన ఆయకట్టు రైతులు పాల్గొన్నారు.

పుట్టగొడుగుల్లా ఇటుక బట్టీలు

» కోట్లలో వ్యాపారం
» శ్రమ దోపిడీకి గురవుతున్న వలస కూలీలు
» పట్టించుకోని లేబర్ అధికారులు

మక్తల్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మక్తల్ నియోజకవర్గంలోని మక్తల్, మాగనూరు మండల కేంద్రాల్లో ఇటుక బట్టీల వ్యాపారులు ఆడిందే ఆట.. పాడిందే పాటగా మారింది. గత కొన్ని ఏళ్ల నుంచి ఈ వ్యాపారం జరుగుతున్నా జిల్లా లేబర్ అధికారులు మామూళ్లకు అలవాటు పడి వలస కూలీల గురించి పట్టించుకోవడం లేదు. మక్తల్, మాగనూరు మండలాల్లో జాతీయ రహదారి పొడవునా ఇటుకబట్టీలు పుట్టగొడుగుల్లా పుట్టుకువస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. వలస జిల్లా అయిన పాలమూరు జిల్లాకు ఒరిస్సా రాష్ట్రం నుంచి మక్తల్‌కు వలస వచ్చి వెట్టిచాకిరీలో మగ్గి తమ జీవితాలు వదులుకుంటున్నారు. ఒరిస్సాలోని గుత్తేదారులతో వెయ్యి పెళ్లలకు రూ.500లు చెల్లిస్తామని అక్కడ బ్రోకర్లతో అడ్వాన్సులు తీసుకొని వెయ్యి పెళ్లల తయారీకి రూ.250లు ఇస్తూ వారితో వెట్టిచాకిరీ చేయిస్తున్నారు. ప్రతీనిత్యం ఎనిమిది గంటలు పనిచేయాల్సి ఉండగా సుమారు 16 గంటలు పనిచేయించి శ్రమదోపిడీకి పాల్పడుతున్నారు.

జోరుగా ఒండ్రుమట్టి తరలింపు

రైతుల పంట పొలాలకు తరలించాల్సిన ఒండ్రుమట్టిని యదేచ్ఛగా ఇటుక బట్టీలకు తరలిస్తున్నారు. అక్కడ, ఇక్కడ అనే తేడా లేకుండా మాగనూరు, మక్తల్ మండల పరిసరాల్లో, జాతీయ రహదారి పొడవునా వెలసిన ఇటుక బట్టీల వద్ద ఎటుచూసినా ఒండ్రుమట్టి డంప్‌లు దర్శనం ఇస్తున్నాయి. ఇటుకబట్టీ వ్యాపారులు బడా నేతలకు మామూళ్లు ముట్టజెప్పి సమీప గ్రామాల్లోని చెరువుల నుంచి ఒండ్రును తరలిస్తున్నారు.

విద్యుత్ చౌర్యం

ఇటుక బట్టీలకు విద్యుత్ అవసరం అయితే ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకొని అనుమతులు తీసుకున్న తర్వాతే విద్యుత్ వినియోగించాలి. కానీ సమీపంలోని వ్యవసాయ పొలాల నుంచి నీటిని వాడుకుంటున్నారు. వ్యవసాయ పొలాలకు అందించే ఉచిత విద్యుత్ ఇటుక బట్టీ వ్యాపారులకు వరంగా మారింది. ఈ విషయంపై విద్యుత్ అధికారులు ఎక్కడా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. మామూళ్లతో సరిపెడుతున్నారు.

ప్రజాప్రతినిధుల అండదండలతో వ్యాపారం



మక్తల్, మాగనూరు మండలాల పరిధిలోని ఇటుక బట్టీల్లో ఒరిస్సాకు చెందిన దాదాపు ఐదు వేల మంది వలస కూలీలు ఉన్నారు. వీరికి వెంటనే విముక్తి కల్పించాలి. ఆయా మండలాల్లో వెయ్యికోట్ల వ్యాపారం జరుగుతోంది. ప్రజాప్రతినిధులు, అధికారుల అండదండలతో అక్రమంగా ఇటుక బట్టీలు నిర్వహిస్తున్నారు. మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల కలెక్టర్లు స్పందించి వెట్టిచాకిరీ చేస్తున్న కార్మికులకు విముక్తి కల్పించాలి.

- చిన్న వెంకటేష్, మక్తల్



మక్తల్ మండల శివారులోని ఓ ఇటుక బట్టీ

ఆలయ నిర్మాణానికి భూమిపూజ



ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న నాయకులు

మక్తల్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మక్తల్ పట్టణ సమీపంలోని బీసీ కాలనీలో బుధవారం ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేశారు. పట్టణ ప్రముఖులు, వివిధ పార్టీల ముఖ్య నాయకుల సమక్షంలో వేద పండితులు రాఘవేంద్ర ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా ఆలయ నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రాఘవేంద్ర మాట్లాడుతూ ఆలయాల నిర్మాణంతోనే ఆధ్యాత్మిక, భక్తిభావం పెరుగుతుందన్నారు. దైవచింతన మనిషిని సన్మార్గంలో నడిపిస్తుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు రాజుల ఆశిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు కొండయ్య, మల్లికార్జున్, మధుసూదన్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, బలరాంరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, చిన్నహన్మంతు, కాలనీవాసులు పాల్గొన్నారు.

మల్లికార్జునస్వామి విగ్రహం, ధ్వజస్తంభ ప్రతిష్ఠ



కొత్తపల్లి మండల కేంద్రంలోని మల్లికార్జునస్వామి ఆలయం ముందు ప్రతిష్ఠిస్తున్న ధ్వజస్తంభం

కొత్తపల్లి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మల్లికార్జున స్వామి ఆలయ నిర్మాణంలో భాగంగా సోమవారం నుంచి బుధవారం వరకు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం స్వామి వారిని విగ్రహ ప్రతిష్ఠ చేసి ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన నిర్వహించారు. అనంతరం ధ్వజస్తంభం దాత బోనపాటి కృష్ణయ్యతో పూజారులు ప్రత్యేక పూజలు చేయించారు. స్వామివారికి అర్చనలు, మంగళహారతి నిర్వహించారు. హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ఆ తర్వాత అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు నాయకులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

వీరసావర్కర్ అడుగుజాడల్లో నడుద్దాం

» బీజేపీ జిల్లా అధ్యక్షుడు సత్యయాదవ్



పేటలో వీరసావర్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న బీజేపీ, వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ సభ్యులు

నారాయణపేట, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర సమర మహావీరుడు వీరసావర్కర్ అడుగుజాడల్లో ప్రతీ ఒక్కరు నడవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సత్యయాదవ్, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాంబాబు పిలుపునిచ్చారు. బుధవారం నారాయణపేట పాత బస్టాండ్ చౌరస్తాలో వీరసావర్కర్ వర్ధంతిని పురస్కరించుకొని విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో వీరసావర్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ మహనీయుడు చూపిన మార్గంలో యువత నడవాలన్నారు. కన్న శివకుమార్, ప్రవీణ్, నీరటి వెంకటేష్, కృష్ణ, రఘు, వీరేశ్, రవి, నరేష్, భరత్ తదితరులున్నారు.

శ్రీశైలం మల్లన్న చెంతకు శివస్వాములు



నర్వలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద శివనామ స్మరణ చేస్తున్న శివస్వాములు

నర్వ/కొత్తపల్లి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): నర్వ మండల కేంద్రంతో పాటు పరిధిలోని గ్రామాల నుంచి శివస్వాములు బుధవారం శ్రీశైలం మల్లన్న క్షేత్రానికి బయలుదేరారు. స్థానిక శివాలయం వద్ద గురుస్వామి సిద్దయ్య పలువురు స్వాములకు ఇరుముడులు కట్టారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. స్వాములను సాగనంపేందుకు బంధుమిత్రులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. శివాలయం నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు శివనామ స్మరణ చేస్తూ భజనలతో ర్యాలీగా వచ్చి ప్రత్యేక వాహనాల్లో శ్రీశైలానికి బయలు దేరారు. అదేవిధంగా, కొత్తపల్లి మండల కేంద్రంతో పాటు, భూనీడు, కిషన్‌నగర్, గోకుల్‌నగర్ గ్రామాల్లోని శివస్వాములు గురుస్వాముల వద్ద ఇరుముడులు కట్టుకొని శ్రీశైలానికి బయలుదేరారు.



కొత్తపల్లి నుంచి శ్రీశైల క్షేత్రానికి బయలుదేరిన శివస్వాములు

వీధుల్లో వెలగని వీధి దీపాలు

» పట్టించుకోని అధికారులు » అంధకారంలో పల్లెలు

కొత్తపల్లి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భూనీడు గ్రామంలో పదిహేను రోజులుగా అంజనేయస్వామి ఆలయానికి వెళ్లే ప్రధాన వీధిలో వీధి దీపాలు వెలగడం లేదని నాలుగవ వార్డు ప్రజలు వాపోతున్నారు. వివిధ పట్టణాలకు వెళ్లి తిరిగి వచ్చిన ప్రయాణికులు బస్టాండ్‌లో బస్సు దిగి ఇంటికి చేరాలన్నా ఈ వార్డు మీదుగానే గ్రామంలోకి వెళ్లాలి. అదే విధంగా, ఆంజనేయస్వామి ఆలయానికి వెళ్లాలన్నా భయభ్రాంతులకు గురవుతున్నామని వారు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వార్డులో వీధి దీపాలకు మరమ్మతులు చేయించి అవి వెలిగేలా చూడాలని కోరుతున్నారు.